సాక్షి ప్రకాశం

సోమవారం । 6 । జనవరి । 2025

7

ఒక్క క్లిక్.. తెగుళ్లకు చెక్

పంటలకు ఆశించే తెగుళ్లు, చీడపీడల గురించి తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక యాప్‌ను రూపొందించింది. పంట ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. - 8లో..



మధ్యంతర భృతిపై మౌనం వీడాలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 30/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ నేడు

ఒంగోలు అర్బన్: షెడ్యూల్ కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ, వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం స్పందన భవనంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై అభిప్రాయ సేకరణ చేసేందుకు రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని ఆ మేరకు కమిషన్ చైర్మన్ మిశ్రా అధ్యక్షతన సోమవారం స్పందన భవనంలో షెడ్యూల్ కులాల ప్రజలు, ఉద్యోగులు, వివిధ సంఘ నాయకులతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిప్రాయాలు, వినతులు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్ కులాల ప్రజలు, ఉద్యోగులు, సంఘాల నాయకులు సద్వినియోగం చేసుకుని అభిప్రాయాలు తెలపాని కోరారు.

డీఈఓను కలిసిన వైఎస్సార్‌టీఏ నాయకులు



డీఈఓ కిరణ్‌కుమార్‌కు డైరీ, క్యాలెండరు అందజేస్తున్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు సిటీ:

ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు మట్టిగుంట మహేశ్వరరావు ఆధ్వర్యంలో డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఈఓకు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ 2025 నూతన డైరీ, క్యాలెండరును అందించారు. ఈ సందర్భంగా మట్టిగుంట మహేశ్వరరావు మాట్లాడుతూ మార్కాపురం, చీరాల మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సిలింగ్ లో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఒకటి, తెలుగు రెండు ప్రమోషన్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. డీఈఓను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతం రమణారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు పల్లప్రోలు శేశిరెడ్డి, బొజ్జా సురేష్, డి.శాంతారావు ఉన్నారు.

9,10,11న ఒంగోలులో తబ్లీగ్ ఇస్తిమా



ఇస్తిమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న షేక్ మహబూబ్, హమీద్ తదితరులు

ఒంగోలు టౌన్:

ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు సంబంధించి జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిజాముద్దీన్ తబ్లీగ్ ఇస్తిమా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు షేక్ మహబూబ్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో జరుగుతున్న ఇస్తిమా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇస్తిమాకు ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి సుమారు 60 వేల మంది వరకు ముస్లింలు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ ఐటీఐ కాలేజీలోని 25 ఎకరాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతులను ఇస్తిమా కమిటీ నాయకుల ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇస్తిమాకు నిజాముద్దీన్, హైదరాబాద్ నుంచి మత పెద్దలు హాజరుకానున్నారని చెప్పారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో తబ్లీగ్ జమాయత్ జిల్లా బాధ్యులు సయ్యద్ హమీద్, షేక్ హసన్, మున్వర్, ఇమాంసా, జిలాని, సిరాజ్, ఉమర్, జుబేర్, అన్వర్, ఇక్బాల్, షరీఫ్, అమీర్ పాల్గొన్నారు.

టంగుటూరుకు చెందిన ఒక వ్యక్తి నుంచి అతడి మిత్రులు, సహోద్యోగులకు రెండు రోజుల క్రితం ఒక మెసేజ్ వచ్చింది. ఆ వ్యక్తి వాట్సప్‌ను హ్యాక్ చేసి డీపీ సైతం మార్చిన మోసగాళ్లు ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి అన్నట్లు ఏపీకే ఫైల్‌తో మెసేజ్ పెట్టారు. ఇది గమనించిన ఆయన మిత్రులు అప్రమత్తం చేయడంతో వెంటనే టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీహార్ నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ హ్యాక్ చేసినట్లు తెలిసింది. ఆఘమేఘాల మీద బాధితుడి వాట్సప్, ఫేస్ బుక్‌లను డీయాక్టివ్ చేశాడు. మొత్తం ఫోన్‌ను రీసెట్ చేశాడు. దీంతో ఎలాంటి నష్టం జరగకుండా బయట పడ్డాడు.

నగరంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన ఒక విశ్రాంత ఉద్యోగి వాట్సప్‌కు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామంటూ అంటూ ఒక రాజకీయ పార్టీ పేరుతో మెసేజ్ వచ్చింది. వాట్సప్‌లో రాష్ట్ర నాయకుల ఫొటోలతో కూడిన డీపీ ఉండడం, కాకినాడకు చెందిన వ్యక్తి మెసేజ్ పెట్టినట్లు వివరాలు ఉండడంతో ఆయన నమ్మాడు. వెంటనే సదరు వ్యక్తిని కాంటాక్ట్ అయ్యాడు. లోన్ పేరుతో ఆయన వద్ద నుంచి సదరు వ్యక్తి రూ.50 వేల వరకు వసూలు చేశాడు. మరో లక్ష రూపాయలకు ఒత్తిడి చేస్తుండడంతో మోసపోయినట్లు గమనించిన విశ్రాంత ఉద్యోగి పోలీసులను ఆశ్రయించారు. అప్పటికే అతడు అనేక మంది నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తెలిసింది. లోన్ పేరుతో మోసానికి పాల్పడిన వ్యక్తి మొబైల్ నెంబర్‌ను ట్రేస్ చేస్తే అతడి సిమ్‌కార్డు కాశ్మీర్‌లో ఉన్నట్లు వస్తుంది. చేసేదేమీ లేక పోలీసులు వదిలేశారు.

నగరంలోని సుజాత నగర్‌కు చెందిన ఒక యువకుడు బెంగళూరులోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. మరో ఉద్యోగం కోసం ఆన్‌లైన్లో సెర్చ్ చేస్తుండగా ఒక యాప్ కనిపించింది. వేయి రూపాయలు పెట్టుబడి పెడితే దానికి 50 శాతం లాభం వస్తుందన్న మెసేజ్‌కు ఆకర్షితుడైన సదరు యువకుడు తొలుత వెయ్యి రూపాయలు పెట్టాడు. అతడికి రూ.1500 వచ్చాయి. వెంటనే రూ.5 వేలు చెల్లిస్తే రూ.7500 వచ్చాయి. అంతే అతడికి ఆ యాప్ మీద నమ్మకం కుదిరింది. ముందు వెనుకా ఆలోచించకుండా రూ.25 లక్షలు చెల్లించాడు. అంతే ఆ తరువాత సదరు యాప్ ఆన్‌లైన్ నుంచి మాయమైంది. ఫోన్ చేసినా సమాచారం లేదు. తాను మోసపోయినట్లు గమనించిన ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు.

నగరానికి చెందిన ఒక వ్యక్తి తన వద్ద ఉన్న ఒక పాత టేబుల్‌ను ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. అతడికి విజయవాడ నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. హిందీలో మాట్లాడాడు. టేబుల్ రేటు అడిగి తెలుసుకున్నాడు. ఎలాంటి బేరం చేయకుండానే ఆ టేబుల్ తాను కొనుక్కుంటున్నానని చెప్పాడు. టేబుల్ తాలుకు డబ్బులను ఫోన్ పే చేస్తానన్నాడు. కాసేపటి తరువాత ఒక రూపాయి పంపించాను వచ్చిందా అని వాకబు చేశాడు. రాలేదని చెప్పగా వాట్సప్‌కు క్యూఆర్ కోడ్ పంపించి అది ఓపెన్ చేసి ఉంటే డబ్బులు పంపిస్తానని చెప్పాడు. దాంతో ఏదో మోసం జరుగుతుందని పసిగట్టిన సదరు వ్యక్తి వెంటనే అప్రమత్తం అయ్యాడు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా క్షణాల్లో బ్యాంకు ఖాతాలోని నగదు మాయం అయ్యేది.

సైబర్ దోపిడీ

"మీకు తక్కువ వడ్డీకే రుణాలు కావాలా.. ఈ లింక్ ఓపెన్ చేయండి...మీకు వెయ్యి రూపాయలు పెడితే 50 శాతం లాభం ఇస్తాం..ఈ యాప్‌లో డబ్బులు కట్టండి.. ఏడాది రీచార్జ్ ఫ్రీగా కావాలా ఇదిగో ఈ లింక్ మీద క్లిక్ చేయండి..మీ నంబర్‌కు కోటి రూపాయల బంపర్ ఆఫర్ తగిలింది డబ్బులు కావాలంటే ఈ సైట్ ఓపెన్ చేయండి..." ఇలా రకరకాల ప్రలోభాలతో నిత్యం పదుల సంఖ్యలో మెసేజ్‌లు మనకు తెలియని నంబర్ల నుంచి కుప్పలు తెప్పలుగా వస్తుంటాయి. ఆశపడి వాటిమీద క్లిక్ చేశారో.. ఇక అంతే మీరు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిపోతారు. మీ దగ్గర ఉన్నదంతా ఊడ్చేసి వారు మాయమవుతారు. ప్రజల అమాయకత్వాన్ని, అత్యాశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. జిల్లాలో ఒక్క ఏడాదిలోనే రూ.9 కోట్లకుపైగా ఇలా సైబర్ దొంగలు కాజేయడం ఆందోళన కలిగిస్తోంది.



- రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- క్షణాల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టేస్తున్న క్రిమినల్స్
- మొబైల్ ఫోన్‌లో కాపు కాసి దొంగతనాలు
- జిల్లాలో గత ఏడాదిలో సుమారు రూ.9 కోట్లకు పైగా టోకరా
- పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- నేరస్తుల ఫోన్లు ట్రేస్ చేస్తే ఇతర రాష్ట్రాలు, దేశాల చిరునామాలు
- ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న పోలీసులు

ఒంగోలు టౌన్: జిల్లాలో రోజురోజుకూ సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. నిత్యం పోలీసు స్టేషన్‌కు వచ్చే కేసుల్లో సైబర్ మోసాలకు గురైన బాధితులు ఎక్కువగా ఉంటున్నారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల వేదికలో కూడా ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. దాంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ సైబర్ నేరాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించారు. అయినా సైబర్ నేరగాళ్లు ఆగడాలు ఆగడం లేదు. రోజుకో వేషంలో మోసానికి తెగపడుతున్నారు. బడా బ్యాంకు లోగోలతో లింకులు పెట్టి మోసాలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల పేరుతో కూడా మోసాలు చేస్తున్నారు. చివరకు పెళ్లి కార్డులు పెట్టి కూడా జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఫ్లిప్‌కార్టు నుంచి పార్శిల్ వచ్చిందంటూ, బంపర్ ఆఫర్ల పేరిట మోసాలు జరుగుతున్నాయి. ఏ మెసేజ్‌లో ఏముందో తెలియక ప్రజలు భయపడి పోయే రోజులు దాపురించాయి. కేవలం మొబైల్ ఫోన్‌ను అడ్డుపెట్టుకొని మోసాలకు పాల్పడుతుండడంతో అనేక మంది అమాయకులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఏకంగా పోలీసుల ఫోన్లు కూడా హ్యాకర్ల బారిన పడ్డాయి. ఇటీవల మార్కాపురం పోలీసుస్టేషన్‌లో పనిచేసే ఓ పోలీసు అధికారి, కంభం సర్కిల్‌లో పని చేసే ఓ పోలీసు అధికారి ఫోన్లు హ్యాక్ అయ్యాయి. వారి సెల్‌ఫోన్ల నుంచి అందరికీ సైబర్ నేరగాళ్లు పంపే ఏపీకే ఫైల్స్ రావడంతో పోలీసు అధికారులు అప్రమత్తమై సెల్‌ఫోన్ వినియోగదారులను అలర్టు చేశారు. గత నెలలో మార్కాపురం పట్టణానికి చెందిన నరేష్ అనే వ్యక్తికి లింకు రావడంతో ఓపెన్ చేయగానే సుమారు రూ.50 వేలు ఖాళీ అయ్యాయి. సుమారు 6 నెలల క్రితం మార్కాపురం పట్టణానికి చెందిన ఓ ప్రధానోపాధ్యాయుడు తాను పంపిన బుక్స్ కొరియర్‌లో అవతల వ్యక్తికి చేరకపోవడంతో ఆన్‌లైన్‌లో ఉన్న ఫోన్ నెంబరుకు ఫోన్‌చేయగా రూ.1 ఫోన్‌పే చేస్తే ఓటీపీ వస్తుందని దీంతో మీరు పంపిన బుక్కులు ఎక్కడున్నాయో చెబుతామని తెలిపారు. సదరు ప్రధానోపాధ్యాయుడు నమ్మి ఓటీపీ చెప్పడంతో సుమారు రూ.50 వేలు ఖాతా నుంచి ఖాళీ అయ్యాయి. ఇలా పలువురు సైబర్ నేరగాళ్ల బారిన పడి బలవుతున్నారు.

చదువుకున్న వారే బాధితులు...

సైబర్ నేరాలకు గురవుతున్న వారిలో ఎక్కువగా చదువుకున్న వారే ఉండడం పోలీసులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. బీటెక్ చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అత్యాశకు పోయి లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. రూపాయికి రూపాయి లాభం వస్తుందనగానే ముందు వెనక ఆలోచించకుండా సైబర్ వలలో పడుతున్నారు. బంపర్ ఆఫర్‌లో అతి తక్కువ ధరలకు బ్రాండెడ్ కంపెనీ దుస్తులు, వస్తువులు వస్తున్నాయనగానే ఎగిరి గంతేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఆ తరువాత లబోదిబో అంటూ పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడిన వారిలో సామాన్య ప్రజలు కానీ, కూలి పనులు చేసుకునే వారు కానీ ఉండకపోవడం గమనార్హం.

ఏడాదిలోనే రూ.9 కోట్లు స్వాహా...

సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా దోపిడికి పాల్పడుతున్నారు. కళ్లు తెరచి మూసే లోపే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. జిల్లాలో గత ఐదేళ్లుగా జరిగిన సైబర్ నేరాలను పరిశీలిస్తే గుండె గుభిల్లు అనక మానదు. 2019లో 65 కేసులు నమోదు కాగా రూ.24.93 లక్షల నగదును మొబైల్ దొంగలు తస్కరించారు. 2020లో 52 కేసులు నమోదు కాగా రూ.70.37 నగదు మాయం అయింది. 2021లో 48 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో రూ.77.14 లక్షలను కళ్లుగప్పి మోసం చేశారు. 2022లో 87 కేసులు నమోదయ్యాయి, రూ.64.52 లక్షలు సైబర్ దొంగలు నొక్కేశారు. 2023లో 95 కేసులు నమోదు కాగా ఏకంగా రూ.4.81 కోట్లు కాజేశారు. 2024లో సుమారు రూ.9 కోట్ల కష్టార్జితం సైబరార్పణం అయింది. 2019 నుంచి 2022 వరకు నాలుగేళ్లలో రూ.2.37 కోట్ల వరకు సైబర్ నేరగాళ్లు దోచుకోగా ఒక్క 2023లోనే రూ.4.81 కోట్ల దోపిడీకి గురైంది. 2024లో రూ.9 కోట్లకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గత ఆరేళ్లలో దాదాపు రూ.17 కోట్లను సైబర్ నేరగాళ్లు కన్నం వేశారు.



ఎస్సీల స్థితిగతులపై ఆరా..

- జిల్లాలో ఎస్సీ వర్గీకరణ వన్‌మేన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పర్యటన



ఎస్సీ ఉప కులాల వర్గీకరణ వన్‌మేన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాతో కలెక్టర్, జేసీలు

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఏర్పాటు చేసిన వన్‌మేన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం జిల్లాకు వచ్చారు. ఒంగోలు ఎన్నెస్పీ అతిథిగృహంలో బసచేసిన రంజన్ మిశ్రాను కలెక్టర్ తమీమ్ అన్సారియా మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఎస్సీ కాలనీలను పరిశీలించి ఎస్సీల స్థితిగతులపై ఆరా తీశారు. ఒంగోలులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాలు 2, 3లను, భాగ్యనగర్‌లోని బాలికల కళాశాల వసతి గృహాన్ని రాజీవ్ రంజన్ మిశ్రా పరిశీలించారు. విద్యార్థినులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ వివరాలు, వసతి సౌకర్యాలను పరిశీలించారు.

ఏక సభ్య కమిషన్ చైర్మన్ పరిశీలన

నాగులుప్పలపాడు: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం మండలంలోని మద్దిరాలపాడు ఎస్సీ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి స్థితిగతులు తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు అందించిన కొన్ని అర్జీలు స్వీకరించారు.

మద్దిపాడు ఎస్సీ కాలనీలో..

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులో ఎస్సీ కాలనీని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ కాలనీలో పలు రహదారులను పరిశీలించారు. వారి జీవన స్థితిగతులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. విద్యావంతులు, ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని పలువురు యువకులు ఎస్సీ వర్గీకరణలో భాగంగా తమకు న్యాయంగా రావలసిన 15 శాతం వాటా ఇప్పించాలని విన్నవిస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన పలువురి నివాసాలను పరిశీలించి వారి ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడ విద్యార్థులతో వారి విద్యా విధానాన్ని, వారికి అందుతున్న సౌకర్యాలను వసతి గృహం స్థితిగతులను ఆయన పరిశీలించారు. మెనూను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి దగ్గర నుంచి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనలో ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ ప్రసన్న, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ లక్ష్మా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, సహాయక సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టీ లింగయ్య, తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, సుజన్ కుమార్, ఎంపీడీవోలు జ్యోతి, మహాలక్ష్మి, వసతి గృహ సంక్షేమ అధికారి స్వప్న పాల్గొన్నారు. డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ శ్రీకాంత్ బాబు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, మద్దిపాడు ఎస్సైలు బందోబస్తు పర్యవేక్షించారు.



మద్దిపాడు ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు



ఒంగోలులో విద్యార్థినులతో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా



ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండరు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్

ఒంగోలు సిటీ: ఏపీటీఎఫ్ రాష్ట్ర డైరీని, క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా జనార్దనరెడ్డి, డి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి లకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా జనార్దనరెడ్డి, డి.శ్రీనివాసులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు బి.శేషారావు, పి.శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కె.రవి, జే.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పరిటాల సుబ్బారావు, చీమకుర్తి మండల శాఖ అధ్యక్షుడు యాకోబు, మండల శాఖ బాధ్యులు దాస్, ఆర్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం

- జిల్లాలో మొత్తం ఓటర్లు 18,19,448
- మహిళా ఓటర్లు 9,13,450, పురుష ఓటర్లు 9,05885
- నేడు తుది జాబితా విడుదల

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 లో భాగంగా సోమవారం తుది ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేయనున్నారు. ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకారం గత ఏడాది అక్టోబర్ 29వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించగా అనంతరం ప్రత్యేక ప్రచార రోజులు నిర్వహించి నేడు తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. ఆ మేరకు జిల్లా ఎన్నికల విభాగం తుది జాబితాను సిద్ధం చేసింది. సదరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 2183 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 18,19,448 మంది ఓటర్లు ఉండగా వారిలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 9,13,450 మంది ఉండగా, పురుష ఓటర్లు 9,05885 మంది, థర్డ్ జెండర్ 113 మంది ఓటర్లు ఉన్నారు. 6655 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్ ఓటర్లు	మొత్తం ఓటర్లు	సర్వీస్ ఓటర్లు
యర్రగొండపాలెం	265	1,04,711	1,01,573	2	2,06,286	220
దర్శి	282	1,14,086	1,12,137	8	2,26,231	219
సంతనూతలపాడు	256	1,04,995	1,08,823	6	2,13,824	157
ఒంగోలు	259	1,15,058	1,24,417	52	2,39,527	137
కొండపి	283	1,18,367	1,20,878	3	2,39,248	91
మార్కాపురం	257	1,07,770	1,06,473	8	2,14,251	406
గిద్దలూరు	284	1,19,435	1,20,268	22	2,39,725	5235
కనిగిరి	297	1,21,463	1,18,881	12	2,40,356	190
మొత్తం	2183	9,05,885	9,13,450	113	18,19,448	6655

జీతాలు అందక ఉపాధ్యాయుల అవస్థలు

- ఐదో తేదీ దాటినా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు
- కూటమి ప్రభుత్వం పై ఉపాధ్యాయుల్లో పెరిగిన అసహనం

ఒంగోలు సిటీ: "మా ప్రభుత్వం వచ్చాక మీ అందరికీ ఒకటో తేదీనే జీతాలు ఇచ్చే బాధ్యత నాది" అని ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చెప్పిన మాటలివి.. తీరా చూస్తే ఆ మాటలు కేవలం నీటి మూటలుగానే మిగిలిపోయాయి. అధికారంలోకి వచ్చిన నెల ఒకటో తేదీ జీతాలు జమ చేసింది కూటమి ప్రభుత్వం. దీంతో ఉపాధ్యాయులు చాలా సంతోషపడ్డారు. కానీ మిగతా ఏడు నెలల నుంచి జీతాలు ఆలస్యంగా వేస్తుండటంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 14,500 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈనెల ఐదో తేదీ దాటినా జీతాలు పడకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

నమ్మి మోసపోయామంటున్న ఉపాధ్యాయులు..

ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతోంది. లేనిపోని యాప్‌లపై శిక్షణ అని, చీటికీ మాటికీ సమావేశాలంటూ వారిని పాఠాలు చెప్పనీయకుండా అవస్థలు పెడుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే బాగుందని కొందరు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా సీఎంగా ఉన్న చంద్రబాబు ఉపాధ్యాయుల పట్ల వ్యవహరించిన తీరును సంఘాలు మరిచిపోలేదని గుర్తు చేసుకుంటున్నారు. పీఆర్సీ, ఐఆర్ తదితర అలవెన్సుల మీద కూటమి ప్రభుత్వం ఏమాత్రం మాట్లాడకుండా ఉపాధ్యాయుల నోరు నొక్కుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

'తాటిపర్తి' స్మారక ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

● విజేతలకు నగదు బహుమతులు అందజేత



ప్రతిభా పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాటిపర్తి వెంకారెడ్డి స్మారక ప్రతిభా పరీక్షను కొణిజేడు ఎడ్యుకేషనల్ డెవలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని 35 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 412 మంది 10వ తరగతి విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. మొదటి బహుమతి రూ.25 వేలు ఆలకూరపాడు పాఠశాలకు చెందిన పుట్టా వెంకట భార్గవి, రెండో బహుమతి రూ.15 వేలు మార్కాపురం పాఠశాలకు చెందిన వీటీ చంద్రిక, తృతీయ బహుమతి రూ.10 వేలు ఒంగోలు బండ్లమిట్ట పాఠశాలకు చెందిన సీహెచ్‌వీ జాహ్నవి సొంతం చేసుకున్నారు. విజేతలకు జ్ఞాపికలు అందించారు. అలాగే 32 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల టాపర్లకు రూ.3 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతితోపాటు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో తాటిపర్తి గోపాలరెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రామా కామయ్య, పానుగుమాటి పెరుమాళ్లు, కొండపి మండల ఎంఈఓ–2 పచ్చవ రామారావు పాల్గొన్నారు.


మద్యం మత్తులో కారుతో బీభత్సం

ఒంగోలు టౌన్: మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ వ్యక్తి బీభత్సం సృష్టించాడు. టంగుటూరులోని పోతుల చెంచయ్య కాలనీకి చెందిన ఏల్చూరి శ్రీనివాసరావు వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో ఆదివారం ఒంగోలు వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. కొత్తపట్నం బస్టాండు సెంటర్లోని టూటౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా రాగానే కారు అదుపు తప్పింది. అప్పటికే అతడు బాగా మద్యం తాగి ఉన్నాడు. కారు వేగంగా దూసుకెళ్లడంతో ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. అక్కడి నుంచి స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీసు జీపును ఢీకొట్టగా, సీఐ జీపు ముందు భాగం దెబ్బతింది. పక్కనే ఉన్న స్థానిక తూర్పుక్రిస్టియన్‌పాలేనికి చెందిన తేళ్ల సంధ్యను ఢీకొట్టడంతో ఆమె కాలు విరిగింది. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● రైతుల కోసం యాప్ రూపొందించిన కేంద్రం
● తెగులు ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే చాలు
● శాస్త్రవేత్తల సలహాలు ప్రత్యక్షం

ఒక్క క్లిక్.. తెగుళ్లకు చెక్






బేస్తవారిపేట: భూమిలో విత్తును నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకూ రైతులు ఎంతో జాగ్రత్తగా.. శ్రద్ధగా చూసుకుంటారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ పంటను కాపాడుకుంటారు. ముఖ్యంగా పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లపై ఆందోళన చెందుతారు. ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారుల వద్దకో, వీఏఏ, పురుగుమందుల దుకాణాల దగ్గరికో పరుగులు పెడతారు. వారు చెప్పిన మందును పిచికారీ చేసి పంటను కాపాడుకుంటారు. అయితే ఇలాంటి సమయంలో రైతులకు ఎంతో ఉపయోగపడే యాప్‌లను కేంద్ర వ్యవసాయశాఖ అభివృద్ధి చేసింది. రైతులు తమ పొలంలో ఆశించిన చీడపీడలను ఫొటో తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు అది ఏ తెగులు, దానివల్ల కలిగే నష్టమేమిటి, నివారణకు ఎలాంటి మందులు వాడాలనే విషయాన్ని యాప్ తెలియజేస్తుంది. అంటే ఈ యాప్ మీ ఫోన్‌లో ఉంటే మీ దగ్గర ఓ వ్యవసాయ శాస్త్రవేత్త ఉన్నట్లే.

ఎన్‌పీఎస్ఎస్, సీఎల్ఎస్ యాప్‌లు

నేషనల్ పెస్ట్ సర్వైలైన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్ఎస్), క్రాప్ లైఫ్ సిస్టమ్ అనే ఈ యాప్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లను సకాలంలో తెలుసుకుని, నివారణ చర్యలు చేపట్టడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. తెగులును వేగంగా గుర్తించడం, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంతో నష్టం తక్కువగా ఉంటుంది. అలాగే తెగులు మరో పొలానికి, ప్రాంతానికి విస్తరించకుండా ఉంటుంది. దాదాపు 15 రకాల పంటలను ఆశించే కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతిని దీని ద్వారా అరికట్టే అవకాశం ఉంది.



క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్

డౌన్‌లోడ్ చేసుకునే విధానం

స్మార్ట్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఐఓస్ ప్లేస్టోర్‌లో ఎన్‌పీఎస్ఎస్ అని టైప్ చేసిన వెంటనే ఈ యాప్ కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా తెగుళ్లను అరికట్టడంతో పాటు మిత్ర, శత్రు కీటకాలను కూడా గుర్తించవచ్చు. రైతులు కేవలం ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది.

సాంకేతిక పరిజ్ఞానం

కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), యంత్ర అభ్యాసం(మిషన్ లెర్నింగ్) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ యాప్‌లో ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావాలి. మీ పొలాన్ని ఆశించిన తెగులును ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. దాని నియంత్రణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు ఇస్తారు. ఇవన్నీ ఫరీదాబాద్ డీపీపీక్యూస్ కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌లో నిక్షిప్తం చేయబడతాయి. తద్వారా పంటలపై ఆశిస్తున్న తెగుళ్ల సమాచారం ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుంది. ఈ యాప్‌ను ఆగస్టు 15న ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి ఆవిష్కరించారు.

ఎంతో ఉపయోగం

ఎన్‌పీఎస్ఎస్ యాప్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పంటకు సోకిన పురుగులను ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే వెంటనే నివారణ చర్యలు తెలియజేస్తారు. అలాగే మిత్ర, శత్రు కీటకాలను గుర్తించే అవకాశం కలుగుతుంది. పంటల సస్యరక్షణకు అన్ని విధాలా ఉపయోగపడుతుంది.

– జిక్కం మెర్సీ, వ్యవసాయశాఖ ఏఓ

అవగాహన కార్యక్రమాలు

ఎక్కడికక్కడ డివిజన్ స్థాయిలో వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, జిల్లా స్థాయి ఉన్నత అధికారులు ఏఓలకు, ఏఈఓలకు, వీఏఏలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునే విధానం, ఉపయోగించడంపై రైతులను ప్రోత్సహించాలని, యాప్‌లపై విస్తృత ప్రచారం చేయాలని తెలుపుతున్నారు.



ఎన్‌పీఎస్ఎస్ యాప్

మధ్యంతర భృతిపై మౌనం వీడాలి



మాట్లాడుతున్న రమణారెడ్డి

● ఐఆర్ 30 శాతం ప్రకటించాలి
● పీఆర్సీ కమిటీపై దృష్టి సారించకపోవడం అన్యాయం
● ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
● కూటమి ప్రభుత్వానికి ఎస్టీయూ నేతల డిమాండ్

మార్కాపురం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మౌనం వీడి వెంటనే 30 శాతం మధ్యతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మార్కాపురంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రమణారెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు పూర్తయినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టిసారించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న సరండర్ లీవ్ బిల్లులు, హాఫ్ పే లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్, జెడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా జీతాల నుంచి మినహాయించి పొదుపు చేసుకున్న వాటిని కూడా చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. పీఆర్సీ గడువు ముగిసి ఏడాదిన్నర కాలమైనా కమిటీపై, మధ్యంతర భృతిపై దృష్టి సారించకపోవడం సంప్రదాయాలను తుంగలో తొక్కడమేనన్నారు. ఈ నెల 2వ తేదీన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో మధ్యంతర భృతి, డీఏలపై ప్రకటన చేస్తారని ఉద్యోగులంతా ఆశతో ఎదురుచూశారన్నారు. అయితే సమావేశంలో ఎలాంటి చర్చ, నిర్ణయాలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ బకాయిలు చెల్లించడంతోపాటు డీఏ, అరియర్స్, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమ బాట

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ఇదే ధోరణి అనుసరిస్తే ఉద్యమ బాట పడతామని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంగళరెడ్డి, చల్ల శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి నాగయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు కె.ప్రసాద్, శ్యామలాదేవి, లక్ష్మీ నారాయణ, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఇబ్రహీం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక



సెపక్‌తక్రా జిల్లా క్రీడా జట్లు

ఒంగోలు: సెపక్‌తక్రా జిల్లా బాలబాలికల జట్లకు క్రీడాకారులను ఆదివారం స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 50 మందికిపైగా క్రీడాకారులు హాజరవగా, వారిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17, 18 తేదీల్లో పొదిలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికల విభాగంలో మధులత, ప్రహర్షిని, జాహ్నవి, మేఘన, బ్రాహ్మణి, బాలుర విభాగంలో అజయ్‌కుమార్, శివకుమార్, జ్యోతినాథ్, గురుశేఖర్, శివగురుబ్రహ్మం ఎంపికయ్యారు. వారిని సంఘ జిల్లా కార్యదర్శి డి.రవిప్రసాద్, అధ్యక్షుడు వై.సురేష్‌కుమార్, చైర్మన్ డాక్టర్ కృష్ణసాయి అభినందించారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణకు ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9999675672 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బీఎస్ఎన్ఎల్‌ను ఎందుకు ప్రోత్సహించడం లేదు

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్



మహాసభలో మాట్లాడుతున్న ఎన్ఎఫ్‌టీఈ జాతీయ ప్రధాన కార్యదర్శి చందేశ్వర్‌సింగ్

ఒంగోలు టౌన్: ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌ను మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందో చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రశ్నించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయీస్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ బ్రాంచ్ మూడో సర్కిల్ మహాసభలను నగరంలోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రైవేటు టెలికం సంస్థలకు 4జీ సేవలకు వెంటనే అనుమతులిచ్చిన కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు మాత్రం ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదని నిలదీశారు. దేశంలో అత్యధిక ఉద్యోగులు పనిచేస్తున్న రైల్వే శాఖ తర్వాత బీఎస్ఎన్ఎల్ సంస్థ ముందు వరుసలో ఉందన్నారు. మోదీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గత ప్రభుత్వాలు బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగాలను ప్రోత్సహించాయని, బ్యాంకులను జాతీయం చేశాయని చెప్పారు. ప్రభుత్వ రంగంలో ఎన్నో పరిశ్రమలు తెచ్చారని, వాటిలో పనిచేసిన వారు ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ అందుకునే వారని తెలిపారు. ఇప్పుడు రోజురోజుకూ పింఛన్ తీసుకునే వారి సంఖ్య తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపించడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ సర్కార్ పనిచేస్తోందని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ సీజీఎం ఎం.శేషాచలం మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులు మూడు రోజులు సెలవు అడిగితే ఉద్యోగం మానేయమని చెబుతున్నారని, ప్రభుత్వ రంగంలోనే ఉద్యోగ భద్రత ఉంటుందని తెలిపారు. కార్మికులు కష్టపడి పనిచేస్తేనే బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో 403 లొకేషన్లలో 4జీ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఉద్యోగుల బలాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని ఎన్ఎఫ్‌టీఈ జాతీయ ప్రధాన కార్యదర్శి చందేశ్వర్ సింగ్ విమర్శించారు. ఉద్యోగులు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధించడం సులువవుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రమాదేవి, శ్రీధర్, జె.ఉమామహేశ్వరరావు, ఎం.ప్రసాద్‌బాబు, ఆర్.రఘుపతి, షేక్ అబ్దుల్ రవూఫ్, కె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు

పెద్దదోర్నాలలో ఫ్లెక్సీ వివాదం

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఫ్లెక్సీని చించిన దుండగులు



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీ

పెద్దదోర్నాల: వైఎస్సార్ సీపీ నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేసిన ఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దదోర్నాలలో ఆదివారం జరిగింది. నూతన సంవత్సరానికి సంబంధించి ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహనరెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ల పేరిట స్థానిక నాయకులు ఓ ఫ్లెక్సీని గత మంగళవారం రాత్రి స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీని ఆదివారం కొందరు దుండగులు ముక్కలు, ముక్కలుగా చించి వేశారు. దీంతో వివాదం ఏర్పడింది. ఎన్నడూ లేని విధంగా మండలంలో ఫ్లెక్సీలు చించేసి కొందరు వివాదాలకు కారకులవుతున్నారని మండల వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనకు పాల్పడిన దుండగులను గుర్తించి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరుతున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయాలి



మిర్చిపంటను పరిశీలిస్తున్న వెంకటరామిరెడ్డి, రైతులు

మార్కాపురం రూరల్: పశ్చిమ ప్రకాశంలో రైతులు సాగుచేసిన మిర్చిని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మార్కాపురం మండలంలోని వేములకోట, కొట్టాలపల్లి, వేములపేట, కుంట తదితర ప్రాంతాల్లో సాగుచేసిన మిర్చి పంటను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మిర్చిపంటకు తెగులు సోకిందని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రకాశంలో మిర్చి కొనుగోలుకు మార్క్‌ఫెడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో దళారులు చెప్పిన ధరకు రైతులు విక్రయిస్తున్నారన్నారు. మరి కొంతమంది ఆర్థిక ఇబ్బందులు పడుతూ గుంటూరు వెళ్లి రెండుమూడు రోజులు అక్కడే ఉండి అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రైతులు జానపాటి సుబ్బయ్య, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి మృతి



జానపోగు అబ్బురాం (ఫైల్)

మద్దిపాడు: చేసిన అప్పులు తీర్చలేక పురుగుమందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చిలంకూరు గ్రామం దళితవాడలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిలంకూరు పంచాయతీ మాజీ సర్పంచ్ జానపోగు మహాలక్ష్మికి ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడైన జానపోగు అబ్బురాం (46) అదే గ్రామానికి చెందిన మేనమామ కుమార్తె అయిన సుజాతను వివాహం చేసుకున్నాడు. వీరు గ్రామంలో కూలి పనులు చేసుకోవడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చిల్లకర్ర కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అబ్బురాంకు ప్రవీణ ఒక్కతే కుమార్తె. ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా కుమార్తెను బీటెక్ చదివిస్తున్నాడు. ప్రవీణ ఈ ఏడాది బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. ఇంట్లో ఆర్థిక పరిస్థితి, కూతురు చదువు కోసం అందిన చోటల్లా అప్పులు చేశాడు. సుమారు రూ.10 లక్షల వరకు బాకీల పాలయ్యాడు. చేసిన అప్పులు తీర్చలేక పొలం వెళ్లి పురుగు మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పురుగు మందు సేవించి అపస్మారకస్థితిలో పడి ఉన్న అబ్బురాంను ముందుగా కొండపి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ఒంగోలులో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. కుమార్తె ప్రవీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అబ్బురాం వైఎస్సార్ సీపీలో పనిచేసి గ్రామంలో ప్రధాన కార్యకర్తగా గుర్తింపు పొందారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అబ్బురాం మృతదేహానికి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి నగరోత్సవం



పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి



నగరోత్సవంలో భక్తుల కోలాటం

చీమకుర్తి: శ్రీ వెంకటేశ్వరస్వామి నగరోత్సవాన్ని శనివారం రాత్రి చీమకుర్తిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి మాల ధరించిన భక్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి 516 కలశాలతో చీమకుర్తిలోని హరిహరక్షేత్రం వద్దకు పవిత్ర గంగాజలాలను తీసుకెళ్లారు. అనంతరం రాత్రివేళ విద్యుత్ దీపాల అలంకరణలతో స్వామి వారికి నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి నగరోత్సవంలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.